క్లుప్తంగా

కార్యకర్తకు పరామర్శ



రామదాస్‌ను పరామర్శిస్తున్న సీదిరి అప్పలరాజు

మందస: చీపి పంచాయతీ బోందికారి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సవర రామదాస్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గురువారం రామదాస్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, మండల పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరావు, సాబకోట సర్పంచ్ సవర సంధ్య, సవర కామేష్, బత్తిన హేమారావు, గిరిజన సంఘం నాయకులు జగన్ పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ ప్రతిష్టాపనోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

పలాస: కొఠారింగ్ తాళభద్రలో సీతారామాలయం ప్రతిష్టాపనోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. స్థానిక గిరిజనులతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై పూజా కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమంలో పూజారి సవర డుంబురు, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి కరుకోల సీతారాము, మామిడి ప్రసాదరావు, యశ్వంత్, చంద్రమౌళి పాల్గొన్నారు.

జగన్నాథుడి భూముల వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

మందస: సాబకోటలో జగన్నాథ స్వామి దేవస్థానం భూములకు గురువారం బహిరంగ వేలం జరిగింది. సింగుపురం రెవెన్యూ పరిధిలోని 19 ఎకరాల భూములకు మూడేళ్ల కౌలుకు వేలం నిర్వహించగా 31 మంది సభ్యులు హాజరయ్యారు. అందరిలో 25 మంది డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారి డి.వాసుదేవరావు, సర్పంచ్ సవర సంధ్య, డి.జగన్నాథ్, గణేష్, పర్యవేక్షణ అధికారి శ్రీముఖలింగం తదితరులు పాల్గొన్నారు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగ సాధనలో అధికారులు

కవిటి : ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని తహసీల్దార్ బి.మురళీమోహన్‌రావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల రోజుల పాటు నిర్వహించే యోగా దినోత్సవ వేడుకల్ని గురువారం కవిటి తహసీల్దార్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కవిటి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పి.వాసుదేవరావు విద్యార్థులకు యోగాసనాలు, ధ్యానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు కె.శ్రీనివాసరెడ్డి, ధనంజయ మజ్జి, కె.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

కంచిలి: ఎండీయూ వాహనాల రద్దుతో రాష్ట్ర వ్యాప్తంగా 18,500 కుటుంబాలు రోడ్డున పడ్డాయని, తమకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని మండల ఎండీయూ ఆపరేటర్లు కోరారు. ఈ మేరకు గురువారం కంచిలి తహశీల్దార్ ఎస్.రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బకాయిలు విడుదల చేయాలని, ఇన్సూరెన్స్ పేరిట కోత విధించిన సొమ్మును తిరిగి తమ ఖాతాలకు జమ చేయాలని, వెహికల్ లోన్‌కు సంబంధించి ఎన్‌ఓసీ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆపరేటర్లు రంగాల దీనబంధు, ఎన్.రుషి, పి.గిరిబాబు, కె.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లకు.. మోక్షమెప్పుడో?



- రాళ్లు తేలిన గ్రామీణ ఆర్అండ్‌బీ రోడ్లు
- వాహనచోదకులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు

పలాస:

తాము అధికారంలోకి వస్తే గోతులు లేని రోడ్లుగా తీర్చిదిద్దుతామని ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించిన కూటమి నాయకులు.. గద్దెనెక్కాక ఆ సంగతే మర్చిపోయారు. సంక్రాంతి పండగ ముందు కొంత హడావుడి చేసి తర్వాత మిగిలిన రోడ్లను గాలికొదిలేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా రహదారుల సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయి. వాహనచోదకులతో పాటు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా పలాస మండలంలోని గ్రామీణ ఆర్అండ్‌బీ రోడ్లు ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా గోతుల రహదారే కనిపిస్తోంది. కాశీబుగ్గ నుంచి ధర్మపురం, గరుడభద్ర మీదుగా బొడ్డపాడుకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ధర్మపురం వద్ద రాళ్లు తేలడంతో వాహనాలు ప్రయాణించేటప్పుడు ఏ రాయి ఎప్పుడో తగులుతుందోనని ప్రయాణికులు బిక్కుబిక్కుమంటున్నారు. గరుడభద్ర నుంచి రంగోయి వరకు వెళ్లే రోడ్డు మరింత దారుణంగా తయారైంది. ఇరువైపులా బెర్ములు లేక అస్తవ్యస్తంగా మారింది. ఎదురుదెరుగా వాహనాలు వస్తే తప్పించుకోలేని పరిస్థితి. అధ్వాన రహదారుల వల్ల సుమారు 30 గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ధర్మపురం వద్ద రోడ్డు దుస్థితి



రోడ్డు బాగు చేయమని నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు(ఫైల్)



మర్రిపాడు వద్ద ప్రమాదకరంగా రోడ్డు మలుపు

తరచూ ప్రమాదాలు



కాశీబుగ్గ నుంచి వజ్రపుకొత్తూరు, పలాస మండలంలోని గ్రామాలకు వెళ్లే రహదారులు దారుణంగా ఉన్నాయి. ఆటోలు, బైకులు ప్రమాదాలకు గురవుతున్నాయి. రోడ్లు బాగు చేయాలని నిరసన వ్యక్తం చేసినా ఫలితం లేకపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలి.

– పోతనపల్లి మల్లేశ్వరరావు, ఆటోయూనియన్ నాయకుడు, బొడ్డపాడు,

ప్రతిపాదనలు పంపించాం..



ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరయ్యాక పనులు ప్రారంభిస్తాం. రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయాల్సి ఉంది. వాటిని కూడా గుర్తించాం. నిధులు లేమి వల్లే పనులు జరగడం లేదు. త్వరలో పనులు పూర్తి చేస్తాం.

– విక్రం, ఆర్అండ్‌బీ ఏఈ, కాశీబుగ్గ

వ్యవసాయ మంత్రికి విత్తనాల సమస్య పట్టదా?

- కూటమి ప్రభుత్వంలో రైతులకు తీరని అన్యాయం
- వైఎస్సార్‌సీపీ నాయకుల మండిపాటు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

టెక్కలి: మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వ్యవసాయ పనులు ఆరంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు రైతులకు విత్తనాలు ఇవ్వాలనే ఆలోచన పూర్తిగా లేకపోవడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతు వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధి సత్తారు సత్యం, పట్టణ అధ్యక్షుడు తమ్మన్నగారి కిరణ్ తదితరులు విమర్శించారు. గురువారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. వ్యవసాయ శాఖ మంత్రి సొంత నియోజకవర్గంలో గత ఖరీఫ్ సీజన్‌లో పూర్తి స్థాయిలో విత్తనాలు ఇవ్వలేదని, అంతే కాకుండా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. రబీ సీజన్‌లో కనీసం సాగు నీరు కూడా ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటి వరకు గ్రామాల్లో విత్తనాల పంపిణీ కోసం రైతులకు ఎటువంటి సంప్రదింపులు చేయకపోవడంపై మండిపడ్డారు. అసలు విత్తనాలు పంపిణీ చేస్తారా లేక ప్రైవేట్ డీలర్ల దోపిడీకి బలైపోవాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌలు రైతుల కార్డుల కోసం కనీసం ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. కొద్ది రోజుల క్రితం భూసమస్యల కోసం స్వీకరించిన వినతులను బుట్టదాఖలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగం నిర్లక్ష్య వైఖరితో రైతులు రుణాల కోసం ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అన్నదాత సుఖీభవ ఎప్పుడిస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందేవని, కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఇటువంటి దగా ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

మందస తహసీల్దార్‌గా శ్రీకాంత్



శ్రీకాంత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

మందస: మండల తహసీల్దార్‌గా మిస్క శ్రీకాంత్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన జి.సిగడాం తహసీల్దార్‌గా విధులు నిర్వహించి డిప్యుటేషన్‌పై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారులకు పోటీలు



టెక్కలి: హనుమాన్ జయంతి సందర్భంగా రోటరీనగర్‌లోని సత్యసాయి శాంతి సుధా మందిరంలో బాల వికాస్ చిన్నారులకు కోలాటం, భక్తి పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు సత్యసాయి సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో చిన్నారులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు హనుమాన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవ ధాన్యాల సాగుతో మేలు



బేసిరామచంద్రాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సోంపేట: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు తెలియజేశారు. నవ ధాన్యాల సాగు నేల తల్లిబాగు కార్యక్రమంలో భాగంగా బేసిరామచంద్రాపురంలో గురువారం నవధాన్యాల కిట్లను తయారు చేసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ నవ ధాన్యాలు సాగు చేయడం వల్ల నేలలో కర్బన్ శాతాలు పెరుగుతాయని చెప్పారు. ఫలితంగా పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి కుమారి, సిబ్బంది తులసయ్య, సుజాత, కృష్ణవేణి, వీఏఏ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగు.. ప్రోత్సహిస్తే బాగు!

- తరతరాలుగా ఆ గ్రామస్తులకు కాయగూరల సాగే జీవనాధారం
- గిట్టుబాటు ధరలు లేక ఇక్కట్లు
- ప్రభుత్వ సాయం అందించాలని వినతి



బలియాపుట్టుగ గ్రామంలో బీరపాదులు

కంచిలి :

మండల కేంద్రంలోని బలియాపుట్టుగ, చిన్నపాత్రపడ, పెద్దపాత్రపడ గ్రామాల ప్రజలు తరతరాలుగా కూరగాయల పంటే జీవనాధారంగా ముందుకు సాగుతున్నారు. లాభనష్టాలకు సంబంధం లేకుండా ఇంటిల్లపాదీ కూరగాయలు సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. పూర్వం నుంచి వీరు ఎటువంటి పురుగు మందులు వినియోగించకుండానే కూరగాయల్ని సాగుచేస్తున్నారు. దీంతో వీరి ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటోంది. అయితే సంతృప్తస్థాయిలో ధరలు గిట్టుబాటు కావడం లేదని రైతులు అంటున్నారు. ఇక్కడి పంట ఉత్పత్తులను సోంపేట, కంచిలి కూరగాయల మార్కెట్‌లకు తీసుకెళ్లి వర్తకులకు అమ్ముతుంటారు. వీరు పండించిన బీర, కాకర, దొండ, బెండ, కాలీఫ్లవర్, టమాటా, క్యాబేజీ బుట్ట తదితర ఉత్పత్తులను తక్కువ ధరలకే హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి, రిటైల్‌గా అమ్మేటప్పుడు మాత్రం వినియోగదారుల వద్ద అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు.

ప్రభుత్వ సాయం అంతంతమాత్రమే..

కూరగాయలు సాగుచేసే రైతులకు ఉద్యానశాఖ నుంచి సాయం కూడా అంతంతమాత్రమే ఉంటోంది. ఉద్యానశాఖ నుంచి కనీసం ఎకరా సాగు చేసే రైతులకు మాత్రమే పందిళ్లు వేయడానికి రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నారు. అయితే చాలా మంది రైతులు 10 నుంచి 30 సెంట్లు భూముల్లోనే కూరగాయలు పండిస్తున్నారు. దీంతో వీరికి ప్రభుత్వ సాయం అందట్లేదు. చిన్న విస్తీర్ణాల్లో సాగుచేసే వారికి కూడా ప్రభుత్వ సాయం అందించాలని వారంతా కోరుతున్నారు.



కాకరకాయల సాగు చేస్తున్న రైతులు

సాయం అందట్లేదు..



కూరగాయలు సాగుచేసే రైతులకు పూర్తిగా ప్రభుత్వ సాయం అందట్లేదు. కనీసం ఎకరా భూమి ఉండి సాగు చేసే వారికే ప్రభుత్వం ద్వారా రూ.10వేలు చొప్పున పందిళ్లు వేయడానికి ఆర్థిక సాయం చేస్తున్నారు. మిగతా తక్కువ విస్తీర్ణం భూమి కలిగిన వారికి ఎటువంటి సాయం అందజేయడం లేదు.

– కల్లా కృష్ణ, కూరగాయల రైతు, బలియాపుట్టుగ గ్రామం

గిట్టుబాటు కావడం లేదు..



ఆరుగాలం కష్టపడి సాగుచేసిన కూరగాయల ఉత్పత్తులకు ధరలు గిట్టుబాటు కావడం లేదు. తాము పండించే కూరగాయలకు హోల్‌సేల్ వ్యాపారులు గిట్టుబాటు ధరలు చెల్లించడం లేదు. ఇంటిల్లపాది కష్టపడినప్పటికీ ప్రయోజనం లేకుండాపోతోంది. తరతరాలుగా కూరగాయల సాగునే నమ్ముకొని జీవిస్తున్నాం.

– కల్లా రాము, కూరగాయల రైతు, బలియాపుట్టుగ గ్రామం

వైభవంగా ఎల్లమ్మ సంబరం



పుటియాదళ రెవెన్యూ పరిధిలో ఎల్లమ్మ అమ్మవారి సంబర మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ప్రగడపుట్టుగ, రామయ్యపుట్టుగ గ్రామస్తుల ఆధ్వర్యంలో అమ్మవారికి వివిధ రకాల పండ్లను నైవేద్యాలుగా సమర్పించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు. అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్ద మేళతాళాలతో ఊరేగించారు. – కవిటి

ఘనంగా గ్రామదేవత ఉత్సవం



తలతంపర గ్రామంలో 42 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న సింధుపటరాణి గ్రామదేవత ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు అమ్మవారిని తిరువీధుల్లో ఊరేగిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వమిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. – కంచిలి

వైభవంగా హనుమాన్ జయంతి



కవిటి: రామయ్యపుట్టుగలో హనుమజ్జయంతి వేడుకలు



ఇచ్ఛాపురం/టౌన్: హనుమాన్ దీక్షలో భక్తులు



మందస: బోయివీధిలో అభయాంజనేయ వేడుకలు



టెక్కలి రూరల్:వంశధార కాలనీలో పూజలు



కంచిలి: కర్తలిలో హనుమాన్ జయంతి వేడుకల్లో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి



ఇచ్ఛాపురం: బెల్లుపడ శివానందగిరిపై పూజలందుకుంటున్న హనుమాన్



కాశీబుగ్గ: లేబరుకాలనీలో పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు



సోంపేట: సుంకిడిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు



సోంపేట: సుంకిడిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపనలో ఎంపీపీ నిమ్మన దాస్

హనుమాన్ జయంతి వేడుకలు గురువారం అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల వ్యాప్తంగా అభయాంజనేయ స్వామి దేవాలయాల్లో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గారెలు, అప్పాలు వంటి ప్రత్యేక ప్రసాదాలను నివేదించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

మహిళపై దాడి

వజ్రపుకొత్తూరు రూరల్: అనంతగిరిలో బుధవారం జరిగిన దాడి ఘటనలో అదే గ్రామానికి చెందిన జనపాన రమణమ్మ అనే మహిళ తీవ్ర గాయాలపాలైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..బాధితరాలు రమణమ్మకు ఆమె బంధువు జనపాన సాంబమూర్తి కుటుంబ సభ్యులతో మామిడితోట విషయంలో కొంతకాలంగా తగాదా జరుగుతోంది. ఈ క్రమంలో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా వంట చేసుకుంటున్న సమయంలో మరోమారు ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం జరిగింది. సాంబమూర్తి, ఆయన కుమారులు రాజేష్,ధనరాజ్‌లు కలిసి దాడికి పాల్పడటంతో పక్కన ఉన్న వంట పొయ్యిపై రమణమ్మ పడిపోయింది. ఈ ఘటనలో రమణమ్మ కాలిపోయి గాయపడింది. బాధితురాలిని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిఫర్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై బి.నీహర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు పోటీలు

మందస: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మందస శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. క్విజ్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జె.విజయలక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.